## క్లుప్తంగా

### రూ.20లక్షలతో సైడ్ డ్రెయిన్లు



మంచాల(చేబ్రోలు): గ్రామంలో సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు మంచాల సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఆయన పనులను పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పంచాయతీకి పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య రూ.20లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి వేప చెట్టు మీదుగా జీబీసీ రహదారి వరకు, రావి చెట్టు సెంటర్ నుంచి రామమందిరం వరకు సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు మూడు రోజులుగా ముమ్మరంగా జరుగుతున్నాయి. నాలుగు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని సర్పంచ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో తోటమాలికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు దాటుతున్న తోటమాలిని ఆటో ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన వడ్లమూడి గ్రామ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. వేజండ్ల గ్రామానికి చెందిన చొప్పర ఏలేబు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో తోటమాలికి పనిచేస్తున్నాడు. గురువారం తెనాలి రోడ్డును దాటుతున్న క్రమంలో తెనాలి నుంచి నారాకోడూరు వైపు వస్తున్న ఆటో ప్రమాదవశాత్తూ అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఏలేబు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉంది. అతని కుమారుడు చొప్పర సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పెదకాకాని: మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ పి.కృష్ణశ్రవంత్ అన్నారు. వెనిగండ్ల గ్రామంలోని మైత్రి కల్యాణ మండపంలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్ఎంపీ సాంబశివరావు, కొండా నాగమోహనరెడ్డి సహకారంతో రక్త పరీక్షలు, ఈసీజీ ఉచితంగా చేశారు. డాక్టర్ పాకనాటి కృష్ణశ్రవంత్ పర్యవేక్షణలో చదలవాడ అమూల్య, డాక్టర్ కృష్ణప్రసాద్ కార్డియాలజీ, న్యూరాలజీకి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. 165 మందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

### 150 మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు: రాజుపాలెం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కాటూరి మెడికల్ కళాశాల హాస్పిటల్ వైద్యులు 150 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన రాష్ట్ర డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో గ్రామ సర్పంచ్ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

### అర్ధరాత్రి విస్తృత తనిఖీలు



పెదనందిపాడు: గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెదనందిపాడు పోలీసు సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి పెదనందిపాడు రామాలయం సెంటర్‌లో ఎస్ఐ అబ్దుల్ రెహమాన్, ఏఎస్ఐ శ్రీనివాసరావు బయట నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు.

### యువకుడిపై పోక్సో కేసు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌గాంధీనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలిక చదువు మానేసి ఇంటి దగ్గర ఉంటోంది. సంజీవయ్యనగర్‌కు చెందిన సాయి అలియాస్ సాగర్ (20) ఆమెతో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. స్నేహంగా మెలుగుతూ గత నెలలో పాడుబడ్డ బిల్డింగ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. కొద్దిరోజులుగా బాలిక అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా, గర్భవతి అని నిర్ధారణ అయింది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

# విజ్ఞాన్ వర్సిటీలో హైటెక్ నర్సరీ పనులు ప్రారంభం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

చేబ్రోలు: మొక్కలను విరివిగా పెంచి పర్యావరణ సమతుల్యానికి కృషి చేయాలని టీవోఎఫ్ఐ, సీఐఎఫ్ఓఆర్ - ఐసీఆర్ఏఎఫ్ డెప్యూటీ చీఫ్ మనోజ్ దబాస్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హైటెక్ నర్సరీ అగ్రి కల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఫాంకు శుక్రవారం భూమి పూజ జరిగింది. మనోజ్ దబాస్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో టీవోఎఫ్ఐ (ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా) ప్రోగ్రాం ద్వారా హైటెక్ నర్సరీను మొట్ట మొదటిగా విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టీవోఎఫ్ఐ ద్వారా హై-క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్స్‌ను తయారుచేయడానికి కావలసిన మౌలిక సదుపాయాలను వర్సిటీ కల్పిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు (పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య) జిల్లాలకు హై-క్వాలిటీ ప్లాంటింగ్ మెటీరియల్స్‌ను సరఫరా చేస్తామని తెలిపారు. టేకు, మామిడి, జామ, సపోట వంటి మొక్కలను ఈ ప్రోగ్రాం ద్వారా జెనిటిక్ మెటీరియల్‌తో తయారుచేసి రైతులకు అందజేయనున్నట్లు వివరించారు. ఈ మొక్కల రూపకల్పన ద్వారా రైతులకు ఉపయోగంతో పాటు, విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ పెరుగుతుందన్నారు. ఏపీ టీవోఎఫ్ఐ స్టేట్ కో-ఆర్డినేటర్ డి.జగన్‌మోహన్‌రెడ్డి, చైర్మన్, వైస్ చైర్మన్‌లు లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు ఆయా విభాగాల డీన్లు, అధ్యాపక సిబ్బంది, అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశభక్తి, క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవలో బాలురతో పాటు ఎన్‌సీసీ బాలికలు తమ పాత్రను పోషించటం అభినందనీయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో బాలికా ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బీ, సీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్‌సీసీ బీ సీ సర్టిఫికెట్ విభాగాల్లో ఉత్తీర్ణులై మంచి ఫలితాలు సాధించిన బాలికా ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించారు. కళాశాలనుంచి 31 మంది ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ బాలికలు ఎన్‌సీసీలో శిక్షణ తీసుకోవటం ద్వారా వారిలో మానసిక స్థైర్యంతోపాటు ఆత్మ రక్షణ పొందే విధంగా తయారవుతారని సమాజాభివృద్ధికి పాటుపడతారన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కర్తవ్యం, క్రమశిక్షణ, ఐక్యతకు మారుపేరు ఎన్‌సీసీ అని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల నుంచి బీ సర్టిఫికెట్‌లను 20 మంది, సీ సర్టిఫికెట్లను 11 మంది పొందారన్నారు. విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కల్నల్ ప్రతాప్‌సింగ్, ఎన్‌సీసీ విభాగం అసిస్టెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ ఉషక్రాంతి తదితరులు అభినందించారు.

### జగనన్న సురక్ష పథకంపై అవగాహన



పెదనందిపాడు: జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పథకం మండల స్థాయి అధికారి సుందర్ ప్రసాదు అన్నారు. శుక్రవారం అన్నపర్రు, నాగులపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం యొక్క అవశ్యకత, ఉపయోగాలు గురించి ప్రజాప్రతినిధులకు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు, అధికారులకు వివరించారు. తహసీల్దారు సుభాని, ఎంపీడీవో రాజగోపాల్, ఎంఈవో డి.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

### ఉపకార వేతనాలు, పుస్తకాల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఉపకార వేతనాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, మహిళా విభాగ రాష్ట్ర చైర్మన్ నిర్మల, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులు కేవీ బ్రహ్మం, కొత్త మాసు శ్రీనివాసరావు, చింతా కృష్ణారావు, నాగేశ్వరరావు, గార్లపాటి సత్యనారాయణ, రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

### కోడి పందేలు వేస్తున్న ఐదుగురి అరెస్టు

గుంటూరు ఈస్ట్: కోడి పందేలు వేస్తున్న ఐదుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సీతమ్మ కాలనీలో కొందరు కోడి పందేలు వేస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ. 3,500తో పాటు కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు.

### గోవుల అక్రమ రవాణా చేస్తే కేసుల నమోదు

పట్నంబజారు: గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం లారీ అసోసియేషన్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా గోవుల్ని రవాణా చేస్తే ఉపేక్షించబోమని చెప్పారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతామని తెలిపారు.

# సేంద్రియ ఉత్పత్తులకు మంచి ఆదరణ

రైతు నేస్తం ఫౌండేషన్‌ను సందర్శించిన కోకా ఎడ్యుకేషనల్ టూర్ విద్యార్థులు



ఆధునిక వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ధనశ్రీ తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌ను కమ్యూనిటీ సైన్స్ కళాశాల బీఎస్సీ హానర్స్ విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా రైతునేస్తం ఫౌండేషన్ సీఈవో సాంబశివరావు సేంద్రియ సాగు విధానాలు, శిక్షణా తరగతులను విద్యార్థులకు వివరించారు. గోశాలను, గో-వ్యర్థాలతో తయారు చేసే వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు, వాటి ద్వారా సేంద్రియ పద్ధతిలో పండించే వివిధ రకాల పంటలను క్షేత్రస్థాయిలో వివరించారు. గానుతో నూనె తీసే విధానం, బిస్కెట్ల తయారీ, చిరుధాన్యాల ప్రాసెసింగ్ యంత్రాలను, పుట్టగొడుగుల తయారీ యూనిట్‌ను ప్రత్యక్షంగా సందర్శించి, రైతునేస్తం సిబ్బంది ద్వారా విద్యార్థులు వివరాలు తెలుసుకున్నారు. సేంద్రియ విధానంను వివరించిన ఫౌండేషన్ అధికారులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# 'ఫ్యామిలీ ఫిజీషియన్' సేవలను వినియోగించుకోవాలి



104 అంబులెన్స్ వద్ద వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వారి స్వగ్రామంలోనే అత్యుత్తమ వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 42 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. గృహ సందర్శనలో భాగంగా బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మాత్రలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రానున్న వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్యాంప్‌కు రోగులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వలేవ, ఏఎన్ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ చోరీలకు పాల్పడే దొంగ అరెస్ట్

నాలుగు బైకులు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బుల్లెట్ బండ్లు

గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడే నిందితుడిని నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు చోరీలు కేసులు నమోదైన ఘటనల్లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ ఆఫీజ్ ఆదేశాలతో సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ మహబూబ్‌బాషా నేతృత్వంలో కేసులను విచారించామన్నారు. విచారణలో బాపట్ల జిల్లా, మండలం, బేతపూడి గ్రామానికి చెందిన దేవర అబ్బన్న అనే వ్యక్తి ప్రస్తుతం బుల్లెట్ ఫ్యాషన్‌గా మారిన నేపథ్యంలో బుల్లెట్ అయితే ఎక్కువ డబ్బు వస్తుందనే ఉద్దేశంతో బుల్లెట్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని విచారణలో తేలిందన్నారు. దీంతో నిందితుని కోసం రెక్కీని నిర్వహించి చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, విచారించగా నిందితుడు చేసిన నేరాలను ఒప్పుకున్నాడన్నారు. అతడి వద్ద నుంచి రూ.7 లక్షల విలువ చేసే 4 బుల్లెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు నల్లపాడు, నగరంపాలెం, పత్తిపాడు, చిలకలూరిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో నేరం చేసినట్లుగా విచారణలో తేలిందన్నారు. కేసును ఛేదించటంలో కృషిచేసిన ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్స్ సుబ్బారావు, షేక్ జాన్‌సైదా, పోతురాజు, వెంకటనారాయణ, మస్తాన్‌వలి, జిల్లా ఐటీ కోర్ టీం బాలాజీ సిబ్బందిని జిల్లా ఎస్పీ, సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు.

# ఆశాజనకంగా వర్షాలు

- తెనాలిలో 57.2 మి.మీ. వర్షం
- సగటున 17.4 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాను తొలకరి పలకరించింది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో వర్షం కురిసింది. తెనాలి, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ, దుగ్గిరాల మండలాల్లో భారీగా.. మిగిలిన మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా తెనాలి మండలంలో 57.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 1.4 మి.మీ. వర్షం పడింది. సగటున 17.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మేడికొండూరు మండలంలో 53.2 మి.మీ., గుంటూరు పశ్చిమ 41.6, గుంటూరు తూర్పు 33.6, దుగ్గిరాల 28.8, చేబ్రోలు 22.2, కాకుమాను 16, ఫిరంగిపురం 15.8, పెదనందిపాడు 14.8, ప్రత్తిపాడు 9.8, పెదకాకాని 7.8, వట్టిచెరుకూరు 3.6, తాడికొండ 3.2, తుళ్లూరు 2.4, కొల్లిపర మండలంలో 1.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 74.4 మి.మీ. కాగా, ప్రస్తుతానికి 62.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వచ్చే రెండు రోజులూ జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

# ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ



తెనాలి: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం సామాన్య ప్రజలకు ఉపయోగపడాలన్న ధ్యేయంతో జీవితకాలం పనిచేసిన ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ స్ఫూర్తిగా నేటి తరం శాస్త్రవిజ్ఞానంపై అభిరుచిని పెంచుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు. డాక్టర్ నాయుడమ్మ 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సంస్థ ఆవరణలో జరిగిన సభలో 'పీపుల్స్ సైంటిస్ట్' పుస్తకాన్ని కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యడ్లపాటి స్వరూపరాణి, యలవర్తి పవన్‌కుమార్, యడ్లపాటి రఘురాం, అడుసుమల్లి సుధాకర్, వెలగా రమేష్‌బాబు, కఠారి వాసుదేవనాయుడు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు మాట్లాడారు. శాస్త్రరంగానికి నాయుడమ్మ సేవలను స్మరించుకున్నారు.

### యువతలో చైతన్యం తీసుకురావాలి

తెనాలిఅర్బన్: విదేశీ విష సాంస్కృతి ప్రసార మాధ్యమాల ద్వారా యువతను, సామాజాన్ని పాడు చేస్తోందని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కళాకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి కళాకారులు కళా రూపాలు ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27 నుంచి 30 వరకు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సాంస్కృతిక సమ్మేళనంలో అందరూ పాల్గొనాలని కోరారు.

### ఆక్రమణల తొలగింపు

తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆక్రమణలను పోలీసులు తొలగించారు. రోడ్డులో వ్యాపారాలు చేస్తున్న వారు సీసీ రోడ్డును ఆక్రమించి ఉంచడాన్ని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. రోడ్డుపై వ్యాపారాలు తొలగించలని వ్యాపారస్తులకు సూచించారు. త్వరలో మున్సిపల్ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగిస్తామని సీఐ తెలిపారు.

# నేటి నుంచి ప్రత్తిపాడులో ఇంటింటికీ వలంటీర్లు..



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీరమ్య, హాజరైన వివిధ శాఖల అధికారులు

ప్రత్తిపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీడీవో శ్రీరమ్య అన్నారు. జగనన్న సురక్ష ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ నేటి నుంచి వలంటీర్లు వారికి మ్యాపింగ్ చేసిన ఇళ్లను సందర్శిస్తారని చెప్పారు. అర్హులైనప్పటికీ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, సచివాలయాల్లో జరిగే సురక్ష కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు. మండలంలో రెండు బృందాలు నెల రోజుల పాటు అన్ని సచివాలయాల్లో స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తాయని చెప్పారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అంతా సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎంపీడీఓ వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామకోటయ్య, ఈవోపీఆర్డీ మావులూరి మోషె, హెచ్‌వో బేబి, ఏఈలు వినీల్, సురేష్, ఏపీఎం సురేష్‌కుమార్, సెక్రటరీ పీరా, నాయకులు పాల్గొన్నారు.

# కుష్ఠు బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే



మాట్లాడుతున్న డీపీఎంవో కోటేశ్వరరావు నాయక్, డాక్టర్ మేరి యునిస్

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించేందుకు నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా రోగులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ స్టడీ డిటెక్షన్ క్యాంపెయిన్)ను ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మేరి యునిస్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలున్న వారిని గుర్తించాలన్నారు. జులై 7వ తేదీ వరకు సర్వేను కచ్చితంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు నాయక్, ఎంపీహెచ్‌ఈవో కె.చెల్లమ్మ, పీహెచ్ఎన్ డి.నిర్మలాదేవి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్త కుప్పల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



పారిశుద్ధ్య కార్మికులతో చెత్త కుప్పలను తొలగిస్తున్న కార్యదర్శి జాన్‌పీరా



బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు

ప్రత్తిపాడు: తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చెత్త కుప్పలను ఎట్టకేలకు పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. స్థానిక హైస్కూల్ పక్కన, వ్యవసాయశాఖ కార్యాలయం, హాస్టల్‌కు వెళ్లే దారిలో రోడ్డు వెంబడి చెత్తాచెదారాలు, వ్యర్థాలను రోజుల తరబడి తొలగించకుండా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'మళ్లీ చెత్త.. అదే రోత' శీర్షికకు పంచాయతీ కార్యదర్శి జాన్ పీరా స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త కుప్పలను తొలగిండంతో పాటు దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించారు. ఎప్పటికప్పుడు గ్రామంలోని చెత్త నిల్వలు పేరుకుపోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

# జగనన్న సురక్షతో సంక్షేమ పథకాలపై మరింత పర్యవేక్షణ



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీటీసీలు, అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మరింతగా పర్యవేక్షణ పెరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు.తాడేపల్లిలోని కార్యాలయం నుంచి శుక్రవారం సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో వర్చువల్ విధానంలో ప్రత్యక్షంగా తిలకించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని హెనీ క్రిస్టినాతో పాటు జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు తిలకించారు. అనంతరం హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నవీ లేనివీ పర్యవేక్షించడం కోసం సీఎం వై.ఎస్. జగన్ మహత్తరమైన కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జె.మోహనరావు పాల్గొన్నారు.

# నర్సింగ్ కళాశాల ఏవోగా వెంకట్రావు



వెంకట్రావుకు అభినందనలు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ కళావతమ్మ

గుంటూరు మెడికల్: గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పరిపాలనా అధికారి (ఏవో)గా ఎ.వెంకట్రావు శుక్రవారం విధుల్లో చేరారు. ప్రిన్సిపాల్ ఎస్. కళావతమ్మను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. బాపట్ల డీఎంహెచ్‌వో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న ఆయన బదిలీపై గుంటూరు నర్సింగ్ కళాశాలకు వచ్చారు. 2020లో ప్రభుత్వం పలు కేడర్లకు చెందిన పోస్టుల్ని కళాశాలకు మంజూరు చేసింది. కొంత మంది అభ్యర్థులు కోర్టుకు వెళ్లడం వల్ల అవి భర్తీ కాలేదు. ఇటీవల కేసును కొట్టివేయడంతో ప్రభుత్వం స్టాఫ్ నర్సులకు ప్రమోషన్లు ఇచ్చి నర్సింగ్ ట్యూటర్స్‌గా పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను కూడా నియమించింది. మొట్టమొదటి ఏవోగా వెంకట్రావు విధుల్లో చేరారు. ఆయన్ను ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.

### ప్రకటన

నా క్లయింటు Ms. Shriram City Union Finance, విజయవాడ, గవర్నర్‌పేట బ్రాంచ్ వారి సంజాయిషీ తెలియజేయునది ఏమనగా పెమ్మసాని శ్రీధర్ S/o. రమేష్‌బాబు, గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, చేబ్రోలు సబ్ రిజిస్ట్రారు, చేబ్రోలు గ్రామానికి చెందిన వారి యొక్క ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము మంజూరు చేయుచున్నారు. కావున ఈ ఆస్తిపై ఎవరికైనను ఎట్టి హక్కులు గానీ, అభ్యంతరములు గానీ ఉన్న యెడల ఈ క్రింది చిరునామాకు 7 రోజుల లోగా తగు సాక్ష్యాధారాలతో తెలియ పరచవలెను. ఎట్టి అభ్యంతరములు రాని యెడల ఈ ఆస్తి నిర్వివాద మైనదిగా భావించి ఋణము మంజూరు చేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బంధ చేయజాలవు.

షెడ్యూలు: గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, చేబ్రోలు గ్రామం, చేబ్రోలు సబ్‌రిజిస్ట్రారు వారి ఇలాకా డాక్యుమెంట్ నెం. 13309/2014 సవరణ డాక్యుమెంట్ నెం. 2898/2019 లో డి.నెం. 301/16, 500 చ॥గ॥ స్థలానికి హద్దులు. తూర్పు: నేను మరియు నా భార్య వాసిరెడ్డి విజయలక్ష్మి గార్లము కలసి జంపాల శ్రీలక్ష్మి గార్కి విక్రయించిన చ.గ. 308లు స్థలం హద్దు. దక్షిణం: శరణం సుబ్బన్న గారి స్థలం కొంత. జానం సాంబయ్య వగైరాల ఆస్తి హద్దు, పడమర: సర్కారు వారి రోడ్డు. ఉత్తరం: నా తాలూకా ఆస్తి హద్దు. ఈ హద్దుల మధ్య ఖాళీ నివేశన స్థలము కలదు.

విజయవాడ | టి.వి.ఎస్. వాసుదేవరావు, అడ్వకేట్,
తేది: 23-6-23 గడివాడ వారి వీధి, VJA. ఫోన్ : 98494 31432